క్లుప్తంగా

పంచారామ బస్సు యాత్ర ప్రారంభం



పంచారామ క్షేత్రదర్శి బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో పంచారామ క్షేత్రదర్శిని ప్రారంభమైంది. కార్తీక మాసం సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం సాయంత్రం పలు డిపోల నుంచి పంచారామ దర్శిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం స్టీల్ సిటీ డిపోలో డిపో మేనేజర్ చటర్జీ పంచారామ క్షేత్రదర్శిని యాత్రను ప్రారంభించారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పంచారామ క్షేత్రాల్లో దర్శనాలు చేయిస్తారు. కార్యక్రమంలో డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నారావు మృతి



అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ విభాగం మాజీ ఉపాధ్యక్షుడు ఈతలపాక కన్నారావు (72) అనారోగ్యంతో 69వ వార్డు తుంగ్లాంలో ఆయన నివాసంలో ఆదివారం మృతి చెందారు. కన్నారావు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వై.ఎస్.రాజశేఖరరెడ్డికి వీరాభిమాని. వైఎస్సార్ సీపీఎస్సీ, ఎస్టీ విభాగాల్లో ఎన్నో విధాలుగా సేవలందించిన నాయకుడని పలువురు కొనియాడారు. కన్నారావు మృతికి మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, రాష్ట్ర ఇంటక్ కార్యదర్శి కొండబాబు తదితరులు సంతాపం తెలిపారు.

గుడ్డ, నార సంచులనే వాడండి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న తిరుమలనగర్ కాలనీవాసులు

అగనంపూడి: ఎకో వైజాగ్‌లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార సంచులనే వినియోగించాలని కోరుతూ తిరుమలనగర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరందామం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు.అలాగే తడి పొడి చెత్తలను వేరు చేసి కంపోస్టు ఎరువుగా వినియోగించాలని సూచించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉక్కునగరం: సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి దత్తత గ్రామం దొడ్డి గ్రామంలో వైద్య శిబిరంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నవీన్ కుమార్, ఇతర వైద్యుల సహకారంతో గ్రామస్తులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సమితి భక్తులంతా గ్రామంలో స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరు పేదలకు వస్త్రాలు, ఒక్కో కుటుంబానికి నెలకు సరిపడే కిరాణా, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కె.ఎస్.ఎస్. రాజు, జి. రామకృష్ణ, కె. ప్రకాశ్, ఎస్.కె.ఆర్.కె. రాజు, వి. కృష్ణ, డి.ఎ.వి. సన్యాసిరాజు, ఎస్.వి. అప్పలరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య అభయం!

- అభ యాప్‌లో రోగి పూర్తి సమాచారం
- మందుల చీటీలు, ఆరోగ్య పరీక్షల వివరాల నమోదు
- గత వైద్య పరీక్షలు, మందుల వివరాలు ఆన్‌లైన్‌లో..
- రిజిస్ట్రేషన్ ప్రక్రియతో మొదలు



అభ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది



అగనంపూడి ఏరియా ఆస్పత్రి

అగనంపూడి: రోగి ప్రిస్కిప్షన్‌తో పనిలేదు.. గతంలో ఏ మందులు వాడారు. ఏఏ రక్త, వైద్య పరీక్షలు నిర్వహించారు.. ఏ వైద్యుల నుంచి సేవలు పొందారో అభ యాప్ ద్వారా పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఎనిమిది నెలల కిందట అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో అభ యాప్ ద్వారా సేవలు ప్రారంభించారు. రోగి రిజిస్ట్రేషన్ ప్రక్రియతో ప్రారంభించి ఏ ఓపీ కౌంటర్‌లో ఏ వైద్యుడు పరీక్షలు నిర్వహించారో సులభంగా తెలుస్తోంది.

అగనంపూడి ఆస్పత్రిలో ఆరు నుంచి ఎనిమిది కౌంటర్లలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. వైద్యుడు రోగిని పరీక్షించి అవసరమైన మందులు కంప్యూటర్‌లోనే నమోదు చేసి ఫార్మసిస్ట్ వద్దకు పంపుతారు.

ఆన్‌లైన్‌లో
ఆయా విభాగాలకు వివరాలు

రిజిస్ట్రేషన్ నంబర్ ప్రకారం ఫార్మసిస్ట్ మందుల వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసి రోగికి అందిస్తారు. ఇలా వైద్యులంతా రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు లేదా రక్త, నీరుడు పరీక్షలు సూచిస్తారు. రోగి ల్యాబ్‌లోకి వెళ్తే మళ్లీ ఎలాంటి పత్రం లేకుండా పరీక్షలు చేసి సంబంధిత వైద్యునికి పంపిస్తారు. ఇలా పేపర్‌తో పని లేకుండా వైద్య సేవలు పొందే వీలు అభ యాప్ ద్వారా కల్పించడంతో చాలా మంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ABHA
Your health | Your choice

అభ యాప్

అవసరమైన కంప్యూటర్ల కొనుగోలు

వైద్యులు పరీక్షించే ప్రతీ కౌంటర్‌తో పాటు ఫార్మసిస్ట్, ల్యాబ్, ఎక్స్‌రే రూమ్‌ల్లో కంప్యూటర్లు అమర్చారు. వాస్తవంగా అభ యాప్ ద్వారా సేవలు అందించేందుకు ప్రభుత్వం కంప్యూటర్లను సమకూర్చాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు చేయకపోవడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి చొరవ తీసుకొని ఆరోగ్య శ్రీ సేవల ద్వారా ఆస్పత్రి ఖాతాలో జమ అయిన మొత్తంతో వీటిని సమకూర్చారు.

వివరాలు నిక్షిప్తం

ఆస్పత్రి ఓపీ కౌంటర్‌లో ఉన్న స్కానర్‌ను **స్మార్ట్ ఫోన్ ద్వారా స్కానింగ్** చేయగానే అభ యాప్ **ఓపెన్ అవుతుంది.** యాప్‌లో మొదటి సారి **లాగిన్ అయి వివరాలు** నమోదు చేస్తే సరిపోతుంది. **మళ్లీ ఎన్నిసార్లు,** ఏ ప్రభుత్వ ఆస్పత్రికి **వెళ్లినా అదే ఫోన్** నంబర్‌తో స్కాన్ చేస్తే ఆటోమెటిక్‌గా **రోగి వివరాలు..** గతంలో తీసుకున్న **వైద్యం వివరాలు** కనిపిస్తాయి. దీంతో రోగి ఏ **ఏ సందర్భాల్లో** ఏఏ మందులు వాడారు.. ఏ **పరీక్షలు చేయించుకున్నారు..** గతానికి ఇప్పటికీ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే విషయాలు వైద్యులకు స్క్రీన్‌మీద కనపడతాయి. రోగి గతంతో ఏ మందులు వాడారో చెప్పకపోయినా వైద్యులకు పూర్తిగా తెలియడంతో మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉందని రోగులు భావిస్తున్నారు.

వేగంగా సేవలు..



అభ యాప్‌లో మొదటిసారి వివరాలు నమోదు చేసుకుంటే నేరుగా వైద్యుడి వద్దకు వెళ్లిపోతున్నాం. తర్వాత మందుల చీటీలతో పనిలేకుండా మందులు ఇస్తున్నారు. ఓపీ చీటీలతో పనిలేదు. ఏదైనా సుస్తీ చేసి ఆస్పత్రికి వెళ్లాలంటే గతంలో రాసిన మందుల చీటితో పనిలేకుండా నేరుగా ఆస్పత్రికి ఫోన్‌పట్టుకొని వెళ్తే సేవలు పొందేందుకు వీలు కలిగింది. ఆరంభంలో కొద్దిపాటి ఇబ్బంది అనిపించినా తర్వాత నుంచి చాలా సులభంగా అనిపిస్తుంది.

– సత్యనారాయణ, గాజువాక

ఓపీ కౌంటర్‌లో ఇబ్బందులు తప్పాయి



గతంలో ఓపీ కౌంటర్ వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. బుధ, శుక్రవారాల్లో అయితే చాలా ఎక్కువ మంది రోగులు ఆస్పత్రికి వస్తుండడంతో క్యూలైన్లలో తగాదాలు జరిగేవి. ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పాయి. గర్భిణులు ప్రతీ నెలా తనిఖీలకు వచ్చేటప్పుడు ఓపీ కౌంటర్ల వద్ద నీరసించిపోయి నిల్చోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చాలా సమయం ఆదా అవుతుంది. పడిగాపులు లేవు. సంతోషంగా ఉంది.

– దేవి, కూర్మన్నపాలెం

రోగికి మెరుగైన వైద్యం

రోగి వివరాలు.. సమస్య అభ యాప్‌లో పొందుపర్చి ఉండడంతో వైద్యులు మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతోంది. ఏ పరీక్షలు నిర్వహించారు.. గతంలో ఏ మందులు వాడారు. తగ్గిందా లేదా అని వైద్యునికి తెలియడంతో రోగికి సత్వర సేవలతోపాటు నాణ్యమైన సేవలు అందుతున్నాయి. అభ యాప్ ద్వారా సేవలు ప్రారంభించిన తర్వాత ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వచ్చిన ఆదాయంతో కంప్యూటర్ల కొనుగోలు చేశాం.

– డాక్టర్ భారతి, సూపరింటెండెంట్, అగనంపూడి ఆస్పత్రి

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సీఐ పార్థసారథి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గాజువాక సీఐ పార్థసారథి, వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 7 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారని గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అలరించిన కవి సమ్మేళనం



పేపర్ క్రాఫ్ట్ పోటీలో విద్యార్థులు

పెదగంట్యాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు, ఏవీఎన్ఎల్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కవిత్రయం, మహా భారత విశ్లేషణలను వివరించారు. అనంతరం గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ అధికారి బిరుదురాజు అమ్మాజీ, ఉపాధ్యాయులు విఠల్‌కుమార్, లావణ్య, నవ్య, రాకేష్, యుగంధర్, హరి పాల్గొన్నారు.

స్టోర్స్‌ను లాభాల బాటలో నడిపించండి



సహకార వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్‌లో ఆదివారం సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా సహకార అధికారి సోమేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కోఆపరేటివ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సహకార సంఘాల ప్రాముఖ్యతను వివరించారు. స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్‌ను లాభాల బాటలో నడిపించేలా అందరూ కృషి చేయాలన్నారు. కోఆపరేటివ్ కార్యదర్శి ఆకుల నూకరాజు, డైరెక్టర్ బి.టి. జగదీశ్వరరావు ఉక్కు కోఆపరేటివ్ స్టోర్స్ కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, అప్పారావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



నిర్వాహకులతో కలిసి రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జనవరి 5న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న అని పేర్కొన్నారు. రక్తదాన శిబిరం నిర్వాహకుడు ద్వారపూడి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వుడా డబుల్ రోడ్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా గల మైదానంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జాగరపు శ్రీను, సనపల ఢిల్లీశ్వరరావు, త్రినాథ్, వినోద్‌బాలు తదితరులు పాల్గొన్నారు.


తలసేమియా బాధితుల కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

గాజువాక: తలసేమియాతో బాధ పడుతున్న చిన్నారుల కోసం గాజువాకకు చెందిన గొడబ మనోజ్ కుమార్, లావణ్య దంపతులు ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ కుమార్తె ప్రేరణ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రక్తదాతలే తలసేమియా బాధితులకు ప్రాణదాతలని అన్నారు. తలసేమియా ప్రాణాంతకమైన వ్యాధి అని, అయితే అమెరికా వంటి దేశాల్లో జినోమ్ పద్ధతి ద్వారా చికిత్స అందిస్తున్నారని చెప్పారు. తలసేమియాతో బాధపడుతున్నవారు జిల్లాలో ఎంతమంది ఉన్నారో గుర్తిస్తే వైద్య సహాయం అందించడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. రక్తదాన శిబిరం నిర్వాహకులను అభినందించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తలసేమియా బాధితులకు మరింత మెరుగైన, ఆధునిక వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. శిబిరంలో 94 మంది రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్‌లతో పాటు రూ.2 లక్షల చొప్పున జీవిత బీమా బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో సౌత్ ఏసీపీ త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారథి, సీనియర్ న్యాయవాదులు వెన్నల ఈశ్వరరావు, రాంబాబు, వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, స్థానిక నాయకులు మహ్మద్ రఫీ, గోమాడ వాసు, ఛత్రపతి శివాజీ, వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు సర్దార్ వినయ్, సాయి గణేష్, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రహదారులు నిర్మించాలి



పాత రోడ్డును పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

అగనంపూడి: ఎన్టీపీసీ, హిందూజా బొగ్గు కాలుష్యంతో పాటు గాజువాక నుంచి ఫార్మాసిటీకి వెళ్లే వాహనాల రద్దీని తగ్గించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడానికి హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి కూడలి నుంచి ఎన్టీపీసీ ట్రాక్‌ను ఆనుకొని రహదారి నిర్మించాలని అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. విశాఖ నగరం, గాజువాక నుంచి నిత్యం వేలాది వాహనాలు ఫార్మా కంపెనీలకు రాకపోకలు సాగిస్తున్నాయని, అలాగే హిందూ పవర్ ప్లాంట్‌కు గంగవరం పోర్టు నుంచి రోజూ వందలాది లారీలతో బొగ్గు రవాణా జరుగుతున్న క్రమంలో అగనంపూడి, లంకెలపాలెం వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఆదివారం 79, 85 వార్డులకు చెందిన అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. అగనంపూడి వంతెన నుంచి ఎన్టీపీసీ రైల్వే ట్రాక్‌ను ఆనుకొని ఏలేరు కాలువ పక్క నుంచి రోడ్డు వేయాలని వారు డిమాండ్ చేశారు. ఏలేరు కాలువపై బైపాస్ మార్గం ఏర్పాటు చేయడానికి ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని పరవాడ మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు కోరారు. బైపాస్ రోడ్ల ఆవశ్యకతను అనకాపల్లి, విశాఖ ఎంపీలతో పాటు పెందుర్తి, గాజువాక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లనున్నామని వారు చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం బొండా అప్పారావుమాస్టార్, నిస్ట్ కళాశాల చైర్మన్ బలుసు ఆనందరావు, అఖిల పక్షాల నాయకులు సుందరపు అప్పారావు, అక్కిరెడ్డి దుర్గునాయుడు, ఎలమర్తి వెంకటరావు, యర్రా కోటేశ్వరరావు, సుందరపు శ్రీనివాసరావు, అమరపిని జోగినాయుడు, నగిరెడ్డి మూర్తి, నక్కరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తకాలు, ర్యాక్‌ల అందజేత



మాట్లాడుతున్న ఉక్కు విశ్రాంత జీఎం దువ్వాడ రామ్‌ప్రసాద్

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు చట్టివానిపాలెంలోని గ్రంథాలయానికి ఉక్కు విశ్రాంత జనరల్ మేనేజర్ దువ్వాడ రామ్ ప్రసాద్ పుస్తకాలు, ర్యాక్‌లు అందించారు. ఈ సందర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని పుస్తక పఠనం కోసం వినియోగించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, బి.సత్యనారాయణ, నరసింహమూర్తి, దేముడు, అప్పలరాజు, గోవింద్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి సామూహిక వ్రతాలు ఘనంగా జరిగాయి. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు,అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో వ్రతాలు నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం సాయంత్రం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను నిర్వహించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించే వరకూ ఉద్యమం



మాట్లాడుతున్న జగ్గునాయుడు

అగనంపూడి: విశాఖస్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు అన్నారు. సీపీఎం స్టీల్ డివిజన్ 5వ మహాసభను ఆదివారం వడ్లపూడిలోని కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం జోన్ పరిధిలో చేపట్టిన ఉద్యమాలు, కార్యక్రమాలతో ప్రజల ఆదరణ పొందిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1500 కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించి ఉద్యమంలో ప్రజలను మమేకం చేయగలిగామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : కార్యక్రమంలో స్టీల్‌జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పీవీఎస్‌బీ శ్రీనివాసరాజు, కమిటీ సభ్యులుగా అయోధ్య రామ్, యు.రామస్వామి, టీవీకే రాజు, ఎన్.రమణ, జి.శ్రీనివాస్, బి.తవుడన్న, కె.వేణు, బి.గురప్ప, జి.సూరిబాబు, యు.మరిడయ్య ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అగనంపూడి: రాజీవ్‌నగర్ కూడలిలో ఓ బైక్ రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ దినపత్రిక డెలివరీ బాయ్‌కు గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం ఉదయం రాజీవ్‌నగర్ కూడలిలో సర్వీస్ రోడ్డు నుంచి కూడలికి వస్తున్న బైక్ ఎదురుగా ఉన్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. అందులో ఓ ద్విచక్రవారం మారుతీవ్యాన్‌ను ఢీకొట్టడంతో ఆంగ్ల దినపత్రికకు చెందిన డెలివరీ బాయ్ తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రంథాలయ పాఠకులకు సభ్యత్వాలు



గ్రంథాలయ సభ్యత్వాలు పొందిన విద్యార్థులు

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో పలువురి పాఠకులకు ఆదివారం నూతన సభ్యత్వాలు అందజేశారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా 10 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాలు అందజేసినట్టు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కా ఫౌండేషన్ ప్రతినిధులు వి.వి.ఎస్.సూరిబాబు, వై.నగేష్, కోన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,ఏసీపీ లక్ష్మణరావు

పెదగంట్యాడ: భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని వెంపళ్లనగర్ కమ్యూనిటీ హాల్‌లో సత్యసాయి భజన మండలి ప్రతినిధి గల్లా శంకర్‌సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి హాజరయ్యారు. ముందుగా సత్యసాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు,మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ సత్యసాయి అంటే సేవ అని, పుట్టపర్తిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ గల్లా శంకర్‌సాయిరాం పేదలకు తనవంతు సేవ చేస్తున్నారని కొనియాడారు. అనంతరం 26 రకాలతో కూడిన నిత్యావసర సరకులు 300 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రైం ఏసీపీ దాసరి లక్ష్మణరావు, న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ దాలిబాబు ,వెంపళ్లనగర్ భజనమండలి కన్వీనర్ కొండబాబు, గాజువాక సమితి కన్వీనర్ సీహెచ్ భాస్కర్, విశాఖ జిల్లా అధ్యక్షుడు నాయుడు, సత్యసాయి సేవకులు పాల్గొన్నారు.

21 నుంచి రిలే నిరాహార దీక్షలు

గాజువాక: విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈ నెల 21 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు తెలిపారు. పాతగాజువాకలో ఆదివారం నిర్వహించిన విశాఖ కో ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. డెయిరీలో చార్టర్ ఆఫ్ డిమాండ్స్ సాధించే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటీశ్వరరావు, విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.వి.మూర్తి, ఎస్.రమణ, నరసన్న, బొత్స నాయుడు తదితరులు పాల్గొన్నారు.